# 'జీవితం'

మొన్ననీమధ్య ఓ మిత్రుడింటికెళ్తే అక్కడ ఓ నలభై అయిదు సంవత్సరాల స్త్రీ కూర్చుని వుంది. సాదా నేతచీర... ఆభరణాలేవీ లేవు. ఆర్థికంగా క్రిందిస్థాయిలో వున్నట్టు తెలిసిపోతోంది. ఆమె ముఖం నాకు బాగా పరిచితంగా అనిపించింది. కానీ ఎంతా లోచించినా గుర్తుకు రాలేదు. మా మిత్రుడితో ఆమె తన గోడు చెప్పుకుని ధన సహాయ మర్థించింది. అతనామెకు ఏమో యిచ్చి పంపించివేసాడు.

అప్పుడతడ్ని అడిగాను 'ఆమెను చూస్తే బాగా పరిచమున్నదానిలా ఉందీ కానీ ఎవరో గుర్తురావడంలేదూ' అని. మా మిత్రుడిచ్చిన సమాధానంతో నోరు వెళ్లబెట్టి కూచుండిపోయా కాసేపు.

ఆవిడ మా కర్నూలులో ధనవంతుల లిస్ట్‌లో పైన అయిదారుగురిలో ఒకరి భార్య నా మిత్రుడి కథనం ప్రకారం రకరకాల వ్యాపారాలు చేసి ఏదీ అచ్చిరాక, అన్నింటా నష్టపోయి... ధనవంతుడి హోదా నిలుపుకోడం కోసం అప్పులు మీద అప్పులు చేసి ఆస్తులు క్రమేణా అమ్ముకుంటూ...ఇదిగో ఈ స్థితి.. తను మొహం చూపలేక భార్యని పంపించి యింకా యింకా అప్పులు చేస్తూనే ఉన్నాడు.

ఎవరి వ్యాపారాలు ఎందుకు నష్టపోతాయో... పిచ్చిపిచ్చి వ్యాపారాలు ఎందుకు విపరీత లాభాల్తో నడుస్తాయో నాకర్థంకాదు. బిజినెస్ అడ్మినిస్ట్రేషన్గురించి ఎన్ని పుస్తకాలు చదివినా లాభంలేదు.

కర్మ సిద్ధాంతాన్ని నమ్ముకునేవాళ్ళకి ఓ సముదాయింపు 'వాడికర్మ' అని ఓ సమాధానం చెప్పుకుంటారు.

సంపదలు పోడం గురించి భర్తృహరి పద్యం ఒకటి (కర్మ సిద్ధాంతం బోధించేదీ) గుర్తొస్తుంది. మననం చేసుకుందాం.

"లలిత నికేతన ప్రియ విలాసవతీ ధవళాతపత్రాస
ద్విలసిత వైభవం భవింపబడున్ సుకృతాను వృత్తిచే
జెలువగు పుణ్యకర్మము నశించిన నంగజ సంగర త్రుట
త్కలిత గుణోరు మౌక్తిక నికాయములట్లు దొలంగు సంపదల్"

నీ కర్మ మంచిదైతే మేడలూ మిద్దెలూ అందమైన భార్యా ఏకచ్ఛత్రాధిపత్యం గల

రాజ్యం వగైరా వగైరా నీకుంటాయి. అది పోతే తీవ్రస్థాయి రతికేళిలో తెగిన ముత్యపు దండలోని ముత్యాల్లా అన్ని సంపదలూ చెల్లాచెదురైపోతాయి అని అర్థం.

ఏది ఏమైనా ఈ జీవితం చిత్రమైంది. ఎప్పుడు ఏ మలుపు వుంటుందో... ఏ క్షణాన ఏమి సంభవిస్తుందో.. ఈరోజున వున్న ఆనందాలు, వినోదాలూ రేపుంటాయో లేదో తెలియదు. ఓ రోజు అకారణంగా దుఃఖం కమ్ముకుని వుంటుంది. ఏదో దిగులు ఎందుకో తెలియదు. ఏమిటి ఈ జీవితం? అసలెందుకీ జీవితం? అనంత విశ్వంలో నేనెవ్వరిని... నాకూ.. నా జీవితానికీ ఈ విశ్వానికీ గల సంబంధం ఏమిటి? లాంటి పిచ్చి ప్రశ్నలు తొలచేస్తాయి. మహామహా తాత్వికులు ఎవరికి తోచిన సమాధానాలను వాళ్లిచ్చారు.

జీవితం తాత్వికత అంటూంటే విశ్వవిఖ్యాత తాత్వికుడు, కవి, చిత్రకారుడు ఖలీల్ జిబ్రాన్ Thoughts & Meditations అన్న పుస్తకంలో ఓ పెద్ద స్కెచ్ గుర్తుకు వస్తోంది.. 'నిన్న నేడు రేపు' అన్నది శీర్షిక. దాన్ని యథాతథం ఇక్కడ యిస్తున్నాను.

"నేనన్నాను, చూడు ఆమె అతని మీదకు ఒరిగి ఉంది.. నిన్న నా మీదకూ యిలాగే ఒరిగి వుండింది...

అతనన్నాడు రేపు నా మీదకూ యిలాగే ఒరుగుతుంది.

నేనన్నాను చూడు ఆమె అతనికి అతుక్కుని కూచునుంది... నిన్ననలాగే నన్నానుకుని కూచింది...

దానికతనన్నాడు రేపు నన్నానుకుని కూచుంటుంది...

మళ్లీ నేనన్నాను, చూడు ఆమె అతని కప్పులో తాగుతోంది నిన్న నా కప్పులోంచి తాగింది....

దానికతన్నాడు రేపు నా కప్పులోంచి తాగుతుంది...

నేనన్నాను చూడు చూడు ఆమె ప్రేమపూరిత నేత్రాల్తో అతన్ని గాఢంగా చూస్తోంది నిన్న నన్ను చూసినలాగ...

అతనన్నాడూ రేపు నన్నూ అలాగే చూస్తుంది అని..

నేనన్నాను విను విను ఆమె అతని చెవిలో మర్మర ప్రేమ గీతాలు వినిపిస్తోంది... నిన్నటి ఆ గీతాలింకా నా చెవిలో మారుమోగుతున్నాయి.

దానికతను రేపు నా చెవిలో ఆమె ప్రేమగీతాలు వినిపిస్తాయి అన్నాడు. నేనన్నాను చూడామె అతన్ని బిగి కౌగిలిలో చుట్టింది నిన్న నన్ను చుట్టినట్టు. దానికతను రేపు నన్ను అలాగే...

నేనన్నాను ఆమె ఎంత విచిత్రమయిన వ్యక్తి... ఎంతకూ బోధపడదు అని అప్పుడతనన్నాడు.

ఆమె 'జీవితం'. ●